# నా మొగుడు మనసున్నోడే

సంక్రాంతికి ఎటూ రెండ్రోజులు సెలవులుంటాయి కాబట్టి వాటికి రెండు సి. యల్స్ జోడిస్తే అత్తవారింటికి వెళ్ళి రావచ్చుననుకున్నాడు ఆనందరావు. సమయానికి సెలవు దొరక్కపోతే పెట్టుకున్న ప్రయాణం ఎక్కడ కాన్సిల్ చేసుకోవలసి వస్తుందోననుకుని అడ్వాన్సుగా లీవు కూడా గ్రాంటు చేయించుకున్నాడు.

ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ఉన్నవాటిలో కాస్త శుభ్రమైన నాలుగు డ్రెస్సులు ఎయిర్ బ్యాగులో వేసుకుని స్టేషన్‌కు బయలుదేరాడు. ఎంక్వైరీలో విచారిస్తే తను ఎక్కవలసిన ట్రైను గంటలేటన్నారు.

చిర్రెత్తింది ఆనందరావుకి. అసహనంగా ఫ్లాట్‌ఫారం మీద అటుఇటు తిరుగుతూ బుక్‌స్టాల్లో వారపత్రిక కొన్నాడు. ప్రయాణీకులు కూర్చునే కుర్చీలో చతికిలబడి పుస్తకం తిరగేస్తున్నాడేగాని దృష్టిమాత్రం అక్షరాలమీద లేదు. మనసు గతంలోకి జారుకుంది.

ఆనందరావుకి పెళ్ళై మూడేళ్ళవుతోంది. చేస్తున్నది చిరుద్యోగమైనా కట్న కానుకల విషయంలో అత్తవారు ఏ లోటూ చేయలేదు. పోతే, లాంఛనంగా ఇస్తానన్న స్కూటరు మాత్రం పండక్కి వాయిదా వేసాడు మావయ్య. ఇస్తానని కమిటయ్యాకా ఇవ్వక ఎక్కడికి పోతాడనుకున్నాడు ఆనందరావు. చూస్తుండగానే రెండు పండగలు వెళ్ళిపోయాయి. వెళ్ళిన ప్రతిసారి కొత్తబట్టలు పెట్టి పంపిస్తున్నాడే తప్ప స్కూటరు మాట ఎత్తడంలేదు. కలిసినప్పుడల్లా తన ఇబ్బందులు ఏకరువు పెడతాడే తప్ప ఇచ్చిన మాటగురించి పట్టించుకోడు.

అన్నమాట ఆచరణలో పెట్టకపోవడంతో రిమ్మెత్తింది ఆనందరావుకి. అందుకే ఈ మారు పండగ నెల రోజులుండనగా పెళ్ళాన్ని పుట్టింటికి పంపేసి బండి



కొనిచ్చేంతవరకు ఆమెను తీసుకురాకూడదని నిర్ణయించు కున్నాడు. బహుశా ఈపాటికి మావగారు తనకోసం స్కూటరు సిద్ధంచేసే ఉంటారు. ఇంటి కెళ్తూనే బండితీసి భాగ్యనగరమంతా చుట్టు ముట్టి రావచ్చుననుకున్నాడు.

ఇలా కలల్లో కరుగుతూ వుండగా 'దొంగ!దొంగ!' అంటున్న మహిళ గొంతు వినిపించింది. ఆమె హారాన్ని కొట్టేసి తన ప్రక్క నుండి పారిపోతున్న వ్యక్తిని గభాలున పట్టుకున్నాడు ఆనందరావు పది మంది మూగారు. దేహశుద్ధిచేసి వాడిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడి చేతిలోని హారాన్ని లాక్కుని బాధితురాలికి అందజేశారు.

ఈ హఠాత్సంఘటన నుంచి తేరుకోకముందే శెగలు కక్కుతూ ఆఘమేఘాల మీద వచ్చి ఆగింది ఎక్స్‌ప్రెస్ ట్రైను.

జారిపోతున్న బ్యాగును భుజం మీదకు ఎగదోసుకుంటూ హడావిడిగా రైలెక్కాడు. అత్తవారింట్లోకి అడుగు పెట్టడంతోనే చిరునవ్వుతో ఎదురొచ్చింది శ్రీమతి.

ఆమె కళ్లల్లో ఆనందం తొణికిసలాడుతోందంటే మామగారు బండి కొనేవుంటారని నిర్ధారించుకున్నాడు. అల్లుణ్ణి ప్రేమగా పలకరించాడు ప్రకాశరావు.

కుశల ప్రశ్నలేసింది అత్తయ్య.

వాళ్ళ మాటలకు ఊ...ఆ... అంటూన్నాడే గాని అతడి చూపులు మాత్రం స్కూటర్‌కోసం గాలిస్తున్నాయి. ఇంట్లో ఎక్కడా బండి కనిపించకపోయేసరికి ఢీలా పడిపోయాడు. ఈ ఏడు కూడా మావగారు తనకి డుమ్మా కొట్టేసినట్లే కనబడుతోందనుకున్నాడు.

అంతవరకు ఉత్సాహంగా ఉరకలేస్తూ వచ్చిన ఆనందరావు నిస్తేజంగా చతికిలబడిపోయాడు. అతడికి అత్తమామలు మీద మింగేయాలన్నంత కోపం వచ్చింది. ఇహ ఉపేక్షించి లాభంలేదు. మాటలతో కడిగేయాలనుకున్నాడు. వస్తూనే విశ్వరూపం ప్రదర్శించడం సభ్యత కాదంటోందతడి అంతరాత్మ. ఎలానూ రెండ్రోజులుంటానుకదా వాళ్ళ ఆంతర్యం తెలుసుకోకుండా తొందరపడటం దేనికని మరి కిమ్మనలేదు.

'బాత్‌రూంలో వేడినీళ్ళు సిద్ధంచేసి ఉంచాను. బట్టలు మార్చుకొండి' అన్నది అనంతలక్ష్మి భర్త బ్యాగ్ జిప్ ఊడదీస్తూ.

'త్వరగా స్నానం చేసి రా బావా టీవీలో 'పండగ అల్లుడు' ప్రోగ్రాం వస్తుంది' అన్నది మరదలు మనోరమ వాల్యూమ్ పెంచుతూ.

అత్తవారింటికొచ్చిన ఆనందరావుకి సకలమర్యాదలు జరిగాయి.

అతడికిష్టమైన పిండివంటలు వండి వడ్డించింది అత్తయ్య.

సుష్టుగా భోంచేసి, కిళ్ళీ బిగించి తనకు కేటాయించిన గదిలోకెళ్ళి మంచంమీద నడుం వాల్చాడు ఆనందరావు.

రాత్రి పదవుతోంది.

పగలంతా బావ బావ అంటూ తనను రకరకాలుగా ఆట పట్టించిన మరదలు నిద్రాదేవి ఒడిలోకి ఒరిగిపోయింది.

అనంతలక్ష్మి కోసం గంటై ఎదురుచూస్తున్నాడు ఆనందరావు.

స్కూటర్ విషయమై తనను అడిగి ఎక్కడ గొడవ చేస్తాడోనన్న బెదురుతో భర్త గదిలోకి వెళ్లేందుకే జంకుతోంది అనంతలక్ష్మి. ఆనందరావు పిలిచినప్పుడల్లా 'ఇదుగో వస్తున్నా' నంటూ ఏదో పని వున్నదానిలా బిజీగా అటు ఇటు తిరుగుతోందే తప్ప మగడి దగ్గరకు వెళ్ళటం లేదు.

'మీ నాన్న బండి కొంటాడా లేదా' అని భార్యను నిలదీసేందుకు మధ్యాహ్నం నుండి ప్రయత్నిస్తున్నాడు. అయితే ఆమె ఒంటరిగా దొరక్కపోవడంతో అవకాశం చిక్కడం లేదు.

సిగరెట్టు వెల్గించి చిరాగ్గా గదిలో అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. అంతలో ప్రక్క గదిలో నుండి అత్తమామల మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

ఆశగా చెవులు రిక్కించాడు ఆనందరావు.

'అల్లుడికి ఈ మారు కూడా బండి కొనివ్వకపోతే బాగోదండి' అన్నది పార్వతమ్మ.

'అందుకే గదే పది రోజుల నుండి కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతున్నాను.

ఇంటి మీద ఇరవై ఐదు వేలిమ్మంటే పది పదిహేనువేలే చేతిలో పెట్టాడు సేఠ్‌జీ' నిట్టూర్చాడు ప్రకాశరావు.

'ఎంత పెంకుటిల్లైనా మన కొంప ఈ రోజుల్లో లక్ష రూపాయలకు తక్కువ చేయదు. మరో పది ఇవ్వడానికేం?'

'ఇవ్వొచ్చు. అయితే అప్పటికే పిల్ల పెళ్లికోసం చేసిన అప్పు వుంది కదా. దానికి ఇది తోడైతే యాభై వేలు దాటిపోతుంది. అదీ వాడి భయం'

'పోనీ ఈ పుస్తెలతాడు తీసుకెళ్లి బజార్లో అమ్మేసి రండి'

'పారూ! ఏమిటి నువ్వంటున్నది. నేను ఉండగానే.....' అదిరి పడ్డాడు ప్రకాశరావు.

'నేనిస్తున్నది తాడేనండి. పుస్తెలు కాదు. పసుపుతాడుకు పుస్తెలు గుచ్చి వేసుకుంటాను. మీరింకేం ఆలోచించకండి. ఈసారైనా మన మాట నిలబెట్టుకోకపోతే లక్ష్మిని కాపురానికి తీసుకెళ్లనంటున్నాడని అమ్మాయి అంటోంది' కంట తడిపెడుతూ అంది పార్వతమ్మ.

అత్తగారి మాటలు వింటున్న ఆనందరావుకి రైల్వే స్టేషన్లో జరిగిన సంఘటన సడన్‌గా గుర్తొచ్చింది. మెడలో హారాన్ని లాక్కుని పారిపోతున్న వ్యక్తిని దొంగ అని ముద్ర వేసి నాలుగు తన్ని పోలీసులకు అప్పగించారు. మరి తన మాట ఏమిటి? తను కూడా ఓ రకంగా దొంగే కదా! మావయ్య దగ్గర డబ్బు లేకపోయినా తన ఒత్తిడి వల్లే కదా అత్తయ్య తన పుస్తెలతాడునిస్తోంది. దానిని ఎంతో హుందాగా స్వీకరించడానికి సిద్ధపడుతున్నాడంటే తను ఘరానా దొంగన్నమాట.

అత్తమామల మాటలకు చలించిపోయాడు ఆనందరావు. ఆ క్షణం తన మీద తనకే హేయభావం కలిగింది.

అంతే, చటుక్కున అత్తయ్య వద్దకెళ్లి తన కోసం పుస్తెల తాడును అమ్మవద్దని బ్రతిమాలాడు.

అల్లుడి పలుకులకు అమితాశ్చర్యపోయారు ప్రకాశరావు దంపతులు. వాళ్ల నోటినుండి మాటలు రావడం లేదు.

'నా మొగుడు మనసున్నోడే' అనుకుని గర్వపడ్డది అనంతలక్ష్మి.

**(19మే 2001 ఆంధ్రప్రభ, వీక్లీ)**